ఈనాడు
మెదక్
మంగళవారం అక్టోబరు 1, 2024

బాధ్యతగా మెలిగితేనే మన్నన: ఎస్పీ


ఉదయ్ కుమార్‌రెడ్డి

మెదక్, న్యూస్‌టుడే: డయల్- 100 సిబ్బంది ప్రజలతో బాధ్యతగా మెలగాలని ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక జిల్లా పోలీస్ కార్యాలయంలో బ్లూకోట్స్, పెట్రోకార్ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 24 గంటలు ప్రజలతో ఉంటారని, ఎక్కడ ఏమి జరిగినా వెంటనే సమాచారం అందించేలా మరింత సంబంధాలు పెంచుకోవాలని, తద్వారా నేరాలను ముందే అంచనా వేసి నియంత్రించేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ సందీప్‌రెడ్డి, డీసీఆర్బీ సీఐ మధుసూదన్ గౌడ్, ఐటీ కోర్ టీం సిబ్బంది అమర్ పాల్గొన్నారు. ● ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా, పైరవీలు చేయకుండా పోలీసు సేవలను వినియోగించుకోవాలని ఎస్పీ సూచించారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా విజ్ఞప్తుల దినం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో మంగళవారం నుంచి ఈనెల 31వరకు జిల్లా వ్యాప్తంగా పోలీసు చట్టం అమలులో ఉంటుందని ఎస్పీ తెలిపారు.

ప్రజావాణి అర్జీలపై ప్రతి వారం సమీక్ష


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, న్యూస్‌టుడే: ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులు పరిష్కారంపై ప్రతి వారం సమీక్ష నిర్వహిస్తామని కలెక్టర్ రాహుల్ రాజ్ స్పష్టం చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలతో వచ్చిన ప్రజలకు జవాబుదారీగా ఉండాలన్నారు. అర్జీలను ప్రతి సోమవారం అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తామని పేర్కొన్నారు. మండల ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి అభివృద్ధి కార్యక్రమాలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. భూ సమస్యలపై 25, పింఛన్ల కోసం నలుగురు, రెండు పడక గదుల ఇళ్లకు 19 మంది, ఇతర సమస్యలపై 39 మంది అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు శ్రీనివాసరావు, జిల్లా వ్యవసాయ గోవింద్ పాల్గొన్నారు.

మాదిగల బలోపేతానికి కృషి


డప్పు వాయిస్తున్న ఎమ్మెల్యే రోహిత్ రావు

పాపన్నపేట, న్యూస్‌టుడే: మాదిగల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తోందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు అన్నారు. సోమవారం మండల పరిధి కొత్తపల్లిలోని ఓ వేడుక మందిరంలో నిర్వహించిన మాదిగ, ఉపకులాల ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మద్దతుతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. మాదిగలు అధైర్య పడవద్దని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని పేర్కొన్నారు. వేదికపై డప్పు వాయించి ఉత్సాహ పరిచారు. అనంతరం పాపన్నపేటలో రైతు నర్సింహులుకు రూ.50 వేల పరిహార చెక్కును అందజేశారు.

దసరా లోపు నామినేటెడ్ పోస్టుల భర్తీ

మెదక్, న్యూస్‌టుడే: ఉమ్మడి మెదక్ జిల్లాలో నామినేటెడ్ పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అంగీకారం తెలిపారని ఉమ్మడి జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండా సురేఖ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఆమె, మంత్రి దామోదర్ రాజనర్సింహతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారు ఉమ్మడి మెదక్ జిల్లాలో నామినేటెడ్ పోస్టుల భర్తీ విషయమై చర్చించారు. పలు సమీకరణాలపై చర్చ అనంతరం ముఖ్యమంత్రి స్పష్టతనిచ్చారని మంత్రి సురేఖ పేర్కొన్నారు. దసరా లోపు పోస్టులను భర్తీ చేయనున్నట్లు సీఎం వివరించారన్నారు.

నీటి సరఫరా సజావుగా సాగేలా..

న్యూస్‌టుడే, పెద్దశంకరంపేట: పల్లెల్లో మంచినీటి సరఫరా సజావుగా సాగేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సహాయకులుగా విధులు నిర్వహిస్తున్న వారికి నైపుణ్య శిక్షణ అందిస్తోంది. ఏ సమస్య వచ్చినా వారే పరిష్కరించే విధంగా అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో కార్యక్రమాలు ప్రారంభమైన నేపథ్యంలో కథనం.

నాలుగు రోజులు: మిషన్ భగీరథ సరఫరాలో తరచూ లీకేజీలు, పైపులైన్లలో సమస్యలు ఏర్పడుతుండడంతో ఏదో ఒకచోట అవాంతరాలు ఏర్పడుతున్నాయి. వీటికి మరమ్మతు చేపట్టాలంటే సాంకేతికత తెలిసిన వారిని పిలిపించుకోవాల్సి వస్తోంది. ట్యాంకుల నుంచి ఇళ్లకు నీటిని సరఫరా చేసే సహాయకులకు మరమ్మతులపై అవగాహన లేదు. సమస్యలు ఉత్పన్నమైనప్పుడు వెంటనే పరిష్కారం కాక, సరఫరాకు అంతరాయం కలుగుతోంది.

దీనిని గుర్తించిన గ్రామీణ నీటి సరఫరా శాఖ సహాయకులకు అవగాహన కల్పించి, శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ప్రతి మండలంలోని అన్ని గ్రామాల సహాయకులకు నాలుగు రోజుల శిక్షణ ఇస్తున్నారు. రోజువారీగా ఒక్కో అంశాన్ని వివరిస్తూ, ఏం నేర్చుకున్నారో పరీక్ష కూడా నిర్వహిస్తున్నారు. నీటి నాణ్యత, లీకేజీలు, ట్యాంకుల శుభ్రత, చేతిపంపులు, సింగిల్, త్రీఫేజ్ మోటార్ల నిర్వహణ నాలుగు అంశాలపై రోజుకో నిపుణుడితో శిక్షణ ఇస్తున్నారు.

జిల్లాలో ఆవాస ప్రాంతాలు	946
సహాయకులు	457
ఓహెచ్ఎస్ఆర్‌లు	1,525
కుళాయిలు	1,92,857

సహాయకులకు శిక్షణ


క్షేత్రస్థాయిలో లీకేజీలపై వివరిస్తూ..

పరిష్కారంపై అవగాహన..

ట్యాంకు నుంచి కట్‌వాల్వులు ఇచ్చే విధానం, నమూనాల సేకరణ, ట్యాంకుల శుభ్రత, బ్లీచింగ్ చేసే విధానం, పైపులైన్ల నిర్వహణ, సింగిల్- త్రీఫేజ్ మోటార్ల వాడకం వంటి వాటిలో ముందుగా సమస్యలు గుర్తించి వాటిని ఎలా పరిష్కరించాలో తెలియజేస్తున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో ఇంటికి సరఫరా అయ్యే పైపులైన్ల ద్వారా నీళ్లు ఎక్కువగా రావాలని స్థానికులు చక్రాలను తొలగిస్తున్నారు. వీటిని తొలగించడం వల్ల దుమ్ము, ధూళితో పాటు బ్యాక్టీరియా పైపులైన్ల ద్వారా నీటి వెంట వస్తాయి. చక్రాలు ఉంటే వడగడుతుంది. ఈ విషయాన్ని గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలని నిపుణులు సూచిస్తున్నారు. తాత్కాలిక పద్ధతిలో నియమితులైన ఈ సహాయకులకు నెలకు రూ. 9,500 చొప్పున చెల్లిస్తున్నారు. శిక్షణ ద్వారా సాంకేతిక మరమ్మతులు వారే చేసుకుంటే పంచాయతీల నుంచి అదనపు ఆదాయం పొందే అవకాశం కూడా కలగనుంది. సెప్టెంబరు 25 నుంచి ప్రారంభించిన శిక్షణ, అక్టోబరు 18 వరకు కొనసాగనుంది.

సమస్యలను అధిగమించడమే లక్ష్యం: నాగభూషణం మిషన్ భగీరథ గ్రిడ్ ఈఈ



శిక్షణ ద్వారా సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారం కానున్నాయి. సహాయకులకు అవగాహన కల్పించి, ఇబ్బందులు ఎదురైతే మరమ్మతులు ఎలా చేపట్టాలో, సరఫరాలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై శిక్షణ ఇస్తున్నాం. వారిని నైపుణ్యం కలిగిన వ్యక్తులుగా ఈ శిక్షణ తీర్చిదిద్దనుంది.


పాపన్నపేట జడ్పీ పాఠశాల

బోధకులు రానున్నారు..

జిల్లాకు 310 మంది రాక

న్యూస్‌టుడే, మెదక్: ఇటీవల మండల విద్యాధికారులను నియమించిన ప్రభుత్వం తాజాగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష ఫలితాలను విడుదల చేసింది. 1:3 ప్రకారం ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించనున్నారు. దసరా పండుగ లోపు నియామకాలు చేపట్టనున్నారు. కొత్తవారి రాకతో సర్కారు బడులు మరింత బలోపేతం కానున్నాయి. బోధన మరింత మెరుగు పడనుంది. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు 897 ఉన్నాయి. వీటిలో 64,265 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రభుత్వం ఇటీవల ప్రభుత్వ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు కల్పించారు. దీంతో ఖాళీలు ఏర్పడ్డాయి. జిల్లాలో అన్ని కేటగిరీలు కలిపి 310 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో ఎస్జీటీ అధికం.

నేటి నుంచి పరిశీలన: జిల్లాలో డీఎస్సీ 2023-2024 ద్వారా ఎంపికైన అభ్యర్థులకు మంగళవారం నుంచి ఈనెల 4 వరకు మెదక్‌లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ధ్రువపత్రాలను పరిశీలించనున్నారు. అక్టోబరు 1వ తేదీన ఎస్జీటీలకు, 2వ తేదీ నుంచి 4వ తేదీ వరకు మిగిలిన అన్ని పాఠ్యాంశాల వారీగా పరిశీలించనున్నట్లు జిల్లా విద్యాధికారి రాధాకిషన్ తెలిపారు. ప్రతి సబ్జెక్టుకు 1:3 ద్వారా అభ్యర్థులను ఆహ్వానించినట్లు, వివరాలను www.medakdeo.com లో పొందుపరిచామని పేర్కొన్నారు. పరిశీలనకు వచ్చే సమయంలో ఒరిజినల్ సర్టిఫికెట్స్‌తో పాటు జిరాక్స్ సెట్ వెంట తీసుకురావాలన్నారు.

జిల్లాలో ఖాళీలు ఇలా...	
ఎస్జీటీ	178
స్కూల్ అసిస్టెంట్	101
భాషా పండితులు	30
పీఈటీ	01

తీరనున్న ఇబ్బందులు

ప్రభుత్వ పాఠశాలల బలోపేతంపై ప్రభుత్వం దృష్టి సారించింది. పదోన్నతులు, బదిలీలు, ఇటీవల మండల విద్యాధికారుల నియామకం వంటివి చేపట్టింది. మరోవైపు సర్దుబాటు ప్రక్రియకు అవకాశం కల్పించింది. 2008 డీఎస్సీలో 70:30 ప్రకారం అర్హత సాధించిన వారిని తాత్కాలిక ఉపాధ్యాయులుగా నియమించనుంది. తాజాగా డీఎస్సీ పరీక్ష ఫలితాలను విడుదల చేసింది.

అటు వెలుగులు.. ఇటు చీకట్లు



కొడిపల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై కిలోమీటరున్నర దూరం వరకు హైమాస్ట్ దీపాలను ఏర్పాటు చేశారు. అవి ప్రస్తుతం వెలగక పోవడం వల్ల రాత్రిపూట అంధకారం నెలకొంది. దీంతో వాహనదారులు, స్థానికులు అవస్థలు పడుతున్నారు. పంచాయతీ తరఫున మరమ్మతులు చేయించారు. ఇందులో బస్టాండు నుంచి సగం దూరం వరకు మాత్రమే వెలుగుతున్నాయి. మిగతా ప్రాంతం చీకటి అలుముకుని ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. పంచాయతీ ఆధ్వర్యంలోనే సమస్యను పరిష్కరించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి వెంకటేశాన్ని వివరణ కోరగా బాగుచేస్తామని చెప్పారు.

\- న్యూస్‌టుడే, కొడిపల్లి

తాళం తెరిస్తేనే వేదన తీరేను..



రామాయంపేట పట్టణం ఒకటో వార్డు ప్రాథమిక పాఠశాలలో శౌచాలయాలు నిర్మించినా వినియోగించలేక విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చాలా రోజులుగా వాటికి తాళం వేసి ఉందని వారు వాపోతున్నారు. పాఠశాలలో 150 మంది విద్యార్థులు, నలుగురు మహిళా ఉపాధ్యాయులు ఉన్నారు. నిర్మాణం పూర్తిచేసిన గుత్తేదారు ఉద్దేశపూర్వకంగా వాటికి నీటి సరఫరా పైపులైన్లు అమర్చలేదని తెలుస్తోంది. దీనికి తోడు వాటికి తాళాలు వేయడం గమనార్హం. అత్యవసర సమయంలో విద్యార్థులు రోడ్డు దాటి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే విషయమై స్థానికులు బైరం కుమార్,శంకర్, రాజు ప్రజావాణిలో సోమవారం ఫిర్యాదు చేశారు.

\- న్యూస్‌టుడే, రామాయంపేట

సీఎస్ఐ చర్చి నిర్మాతకు నివాళి



సీఎస్ఐ చర్చి నిర్మాత చార్లెస్ వాకర్ పోస్నెట్ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం రాత్రి చర్చిలో మెదక్ ప్రెసిబేటరీ ఇన్‌ఛార్జి శాంతయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం పోస్నెట్ చిత్రపటానికి నివాళి అర్పించారు. గురువులు డేవిడ్ రిచర్డ్, జైపాల్, శ్రీనివాస్, చర్చి కమిటీ బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

\- న్యూస్‌టుడే, మెదక్ అర్బన్

విద్యుదాఘాతంతో ఒకరి మృతి



కొల్చారం, న్యూస్‌టుడే: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన కొల్చారంలో సోమవారం జరిగింది. ఎస్సై మహమ్మద్ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నీరుడి రాములు(55) పశువుల పాకలో బల్బు సరిచేస్తుండగా విద్యుదాఘాతం జరిగి అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య మైసమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

గల్లంతై.. విగతజీవిగా మారి..



మెదక్ రూరల్, న్యూస్‌టుడే: మంజీర నది చెంత బోరుమోటారుకు మరమ్మతులు చేస్తుండగా నీటి ప్రవాహంలో గల్లంతైన ఓ వ్యక్తి మృత్యువాతపడ్డాడు. మెదక్ గ్రామీణ ఎస్ఐ మురళి తెలిపిన వివరాలు.. మండలంలోని మగ్దుంపూర్‌కు చెందిన చిన్ననొల్ల బాల్‌రాజ్ (42), నర్సమ్మ దంపతులకు కుమార్తె ఉంది. ఆమెకు పెళ్లయింది. వ్యవసాయమే జీవనాధారం. ఆదివారం మధ్యాహ్నం ఇదే గ్రామానికి చెందిన గణేశ్‌తో కలిసి బాల్‌రాజ్ గ్రామ శివారులోని మంజీర పరీవాహక ప్రాంతంలో నీటిగుంతలోని మోటారుకు మరమ్మతులు చేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. గణేష్ విషయాన్ని గ్రామస్థులకు తెలియజేయగా వారు వచ్చేలోపు గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని పరిశీలించారు. గజ ఈతగాళ్లు గాలించినా ఆచూకీ దొరకలేదు. సోమవారం మళ్లీ గాలించగా మృతదేహం లభ్యమైంది. నర్సమ్మ ఫిర్యాదుతో కేసు నమోదైంది.

కాలుష్య పరిశ్రమ నుంచి కాపాడండి



రంగాయపల్లిలో పరిశ్రమ ఎదుట గ్రామస్థుల ఆందోళన

మనోహరాబాద్, న్యూస్‌టుడే: పరిశ్రమ నుంచి వెలువడుతున్న కాలుష్యంతో అవస్థలు పడుతున్నామని రంగాయపల్లి గ్రామస్థులు ఆందోళన చేపట్టారు. ఎంఎస్ అగర్వాల్ పరిశ్రమ ఎదుట సోమవారం గ్రామానికి చెందిన మహిళలు, యువకులు బైఠాయించారు. ప్రజాభిప్రాయ సేకరణలో ఇరు గ్రామాల ప్రజలు వ్యతిరేకించినా, పట్టించుకోవడంలేదని, అనుమతి లేకుండా విస్తరిస్తున్నారని దీంతో పరిశ్రమ నుంచి వెలువడుతున్న యంత్రాల శబ్దం, రాత్రుళ్లు వదులుతున్న పొగతో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. కాలుష్యంపై అధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోవడం లేదని చెప్పారు. కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకుని కాలుష్య కారక పరిశ్రమ నుంచి ప్రాణాలు కాపాడాలని కోరారు. పోలీసులు నచ్చజెప్పడంతో ఆందోళన విరమించారు.

జీవో 25 సవరిస్తేనే మేలు

మెదక్, న్యూస్‌టుడే: జీవో 25ను సవరించాలని, సర్దుబాటుకు ముందే బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా విద్యాధికారి రాధాకిషన్‌కు వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని, ప్రతి పాఠశాలలో కనీసం ఇద్దరు టీచర్లు ఉండాలన్నారు. జీవో 25 నిబంధనల ప్రకారం ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం వల్ల పాఠశాలలు మూతపడే అవకాశం ఉందన్నారు. తపస్ నాయకులు ఆంజనేయులు, నరేందర్, సత్యనారాయణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రూ.2 లక్షల మోటారుకు రూ.1.50 లక్షలు ఖర్చు చేస్తారా?


మాట్లాడుతున్న అధ్యక్షుడు చంద్రపాల్, చిత్రంలో ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ గౌడ్, ఎమ్మార్వో లక్ష్మణ్‌బాబు, డీఈఈ మహేశ్

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: మంచినీటిని సరఫరా చేసే 50 హెచ్‌పీల సామర్థ్యమున్న రూ.2 లక్షల విలువ చేసే మోటార్ మరమ్మతుకు రూ.1.50 లక్షలు ఖర్చు చేస్తారా అని మెదక్ పురపాలిక ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ గౌడ్, పాలకవర్గం సభ్యులు పురపాలిక డీఈఈ మహేశ్‌ను ప్రశ్నించారు. సోమవారం పురపాలిక సర్వసభ్య సమావేశం చంద్రపాల్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ గౌడ్ మాట్లాడుతూ వారం రోజులుగా పట్టణంలోని పలు ప్రాంతాలకు నీటిని ఎందుకు సరఫరా చేయడంలేదని అధికారులను ప్రశ్నించారు. దీనిపై డీఈఈ మహేశ్ మాట్లాడుతూ పంపు హౌజ్ వద్ద మోటారు కాలిపోయిందని సమాధానం ఇచ్చారు. దీనిపై ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ గౌడ్ మాట్లాడుతూ గత నెలలోనే రూ.50 వేలతో మరమ్మతు చేయించాం కదా అన్ని ప్రశ్నించారు. ఇలా ఇప్పటి వరకు రూ.1.50 లక్షలు వెచ్చించినా ఫలితం లేకుండా పోయిందన్నారు. అధ్యక్షుడు చంద్రపాల్ మాట్లాడుతూ కొత్త మోటారు సంబంధించి ధరను తెలుసుకోవాలని చెప్పినా వినిపించుకోరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో పురపాలిక కౌన్సిలర్లు, డీఈఈ మహేష్, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఉన్నతమైనది


మాట్లాడుతున్న జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్

పాపన్నపేట, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ వృత్తితో పేద విద్యార్థులకు సేవ చేసే భాగ్యం కలుగుతుందని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ అన్నారు. సోమవారం పాపన్నపేటలో నిర్వహించిన టేక్మాల్ మండలం ఎల్లుపేట ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు అశోక్ రెడ్డి పదవి విరమణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. విద్యతోనే సమాజంలో గౌరవం దక్కుతుందని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు అశోక్ రెడ్డిని సన్మానించారు. పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండు లక్ష్మణ్, జిల్లా అధ్యక్షుడు సుంకరి కృష్ణ, ప్రధాన కార్యదర్శి సామ్యా నాయక్, నాయకులు రాజు, సంగమేశ్వర్, వెంకట్రాంరెడ్డి పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

మెదక్, న్యూస్‌టుడే: రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఆనంద్ కలెక్టర్ రాహుల్ రాజ్ వినతిపత్రం అందజేశారు. మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా గౌరవవేతనం ప్రకటించాలి, ఒక క్వింటాకు రూ.300 వరకు కమీషన్ పెంచాలని, ప్రతి ఎంఎల్ఎస్ పాయింట్‌లో ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలన్నారు. డీలర్లకు రూ.10 లక్షల బీమా అమలు చేయాలని, ఆరోగ్య కార్డులు ఇవ్వాలని అందులో కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్, బాధ్యులు షేకులు, భిక్షపతి, నర్సింహులు, ముజీబ్ పాపయ్యచారి, శంకరయ్య చారి, సుధాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


యోగాసన పోటీల్లో మెదక్ విద్యార్థుల ప్రతిభ



అరుణ్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపల్ హుస్సేన్

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: భారత యోగాసన, తెలంగాణ యోగాసన అసోసియేషన్లు సంయుక్తంగా 'నిర్వహించిన తెలంగాణ రాష్ట్ర స్థాయి యోగాసన క్రీడల ఛాంపియన్ షిప్-2024 పోటీల్లో మెదక్ విద్యార్థులు ప్రతిభ చాటారు. సోమవారం మెదక్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ హుస్సేన్ ఆధ్వర్యంలో వేర్వేరుగా విద్యార్థులకు కళాశాలలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెప్టెంబరు 28న నిజామాబాద్‌లో జరిగిన రాష్ట్ర యోగాసన పోటీల్లో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న కార్తీక్ (సీనియర్ రిథమిక్ ఫెయిర్ విభాగంలో బంగారం, ఆర్టిస్టిక్ విభాగంలో రజతం) సాధించారు. వచ్చే నెల కర్ణాటకలోని బెంగళూరు పట్టణంలో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొంటారని వివరించారు. ఈ సందర్భంగా అతడిని సన్మానించారు. కార్యక్రమంలో ఆర్ట్స్ క్యాంపస్ ఇన్‌ఛార్జీ గణపతి, పీడీ వెంకటేశ్వర్లు, అధ్యాపకులు శరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ● తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలకు చెందిన అరుణాబాయి, ఉమేశ్వరి రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని రజతం పతకాలు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఉమాదేవి క్రీడాకారులను సన్మానించి, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందనలు తెలిపారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

నిధులపై ఆశ.. ప్రగతి దశ!


నిర్మాణంలో సమీకృత మార్కెట్

న్యూస్‌టుడే, నర్సాపూర్: అభివృద్ధి పనులకు నిధులే ప్రధానం. అవి ఆగిపోయినా, సకాలంలో విడుదల కాకపోయినా అడుగు ముందుకు పడదు అదే పరిస్థితి నర్సాపూర్ పురపాలికలో నెలకొంది. గత ప్రభుత్వ హయాంలో పట్టణ ప్రగతికి రూ.80.95కోట్లు కేటాయించారు. ప్రభుత్వం మారడంతో నిలిచిపోయాయి. కొన్ని పనులు మధ్యలో ఆగిపోయాయి. మరికొన్ని నేటికీ ప్రారంభానికి నోచడంలేదు. వీటిపై పాలకవర్గం చర్చించి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొండాసురేఖకు వినతిపత్రం అందజేసింది. ఆమె సానుకూలంగా స్పందించారు. పూర్తి వివరాలను సర్కార్‌కు పంపడంతో ఆశలు చిగురిస్తున్నాయి.

టెండరు పూర్తయ్యాక: పురపాలికలోని 15వార్డులకు గత ప్రభుత్వ హయాంలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో పనులను ప్రతిపాదించారు. టెండరు ప్రక్రియను చేపట్టగా, ఈలోగా అసెంబ్లీ, అనంతరం లోక్‌సభ ఎన్నికలు వచ్చాయి. కోడ్ అమలులోకి రావడంతో కేటాయించడంలో జాప్యం జరిగింది. ఈలోగా కొత్త ప్రభుత్వం కొలువు దీరింది. బడ్జెట్ లేదనే కారణంగా పనులను తాత్కాలికంగా ఆపేయాలని ఆదేశాలు ఇచ్చింది. ఇందులో ఒక్కటి ప్రారంభంకాలేదు. పాలకవర్గం సాధారణ సమావేశాల్లో నిధులు కేటాయించాలని తీర్మానాలు చేసింది. వినతిపత్రాలు అందజేసినా, ప్రయోజనం లేకుండాపోయింది.

ఆగిపోయాయి: హరితహారం, పట్టణ ఉద్యానం ప్రారంభానికి వచ్చిన గత సీఎం కేసీఆర్ 2021-22 ఆర్థిక సంవత్సరానికి రూ.25కోట్లు కేటాయించారు. అనంతరం అసెంబ్లీ ఎన్నికలకు ముందు మెదక్ పర్యటనకు వచ్చినప్పుడు మరో రూ.25 కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. అందులో మొదటి విడతలో కేటాయించిన రూ.25 కోట్లతో కొన్ని పనులు ప్రారంభించి, బిల్లులు విడుదల కాకపోవడంతో మధ్యలో ఆపేశారు. రెండో విడతలో కేటాయించిన వాటితో 223 పనులు చేపట్టాలని ప్రతిపాదించారు. వీటిని పూర్తిగా రద్దు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

మంజూరైనవి ఇలా

పథకం	చేపట్టాల్సిన పనులు	నిధులు (రూ.కోట్లలో)
టీయూఎఫ్ఐడీసీ	118	30.95
ఎస్డీఎఫ్ (2021-22)	17	25
ఎస్డీఎఫ్ (2023-24)	223	25

ఇదీ పరిస్థితి

రూ.6 కోట్లతో సమీకృత మార్కెట్, రూ.5 కోట్లతో పురపాలిక సంఘం సొంత భవనం పనులు మధ్యలో అసంపూర్తిగా నిలిచిపోయాయి. మెదక్-నర్సాపూర్ జాతీయ రహదారి నుంచి డీఆర్‌సీసీ షెడ్డు వరకూ రూ.1.80 కోట్లతో రోడ్డు, రూ.2 కోట్లతో మినీస్టేడియం పనులు ప్రారంభం కాలేదు. స్పోర్ట్స్ స్టేడియం మరమ్మతు, సీసీరోడ్లు, మురుగుకాల్వలు, ఓపెన్ జిమ్, పిల్లల ఉద్యానం, కోమటికుంట, రాయరావు చెరువు సుందరీకరణ, మహిళా సమాఖ్య భవనాలు ఇలా ఎన్నో పనులు ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి.

త్వరగా విడుదల చేయాలి: అశోక్‌గౌడ్, పురపాలిక అధ్యక్షుడు

నర్సాపూర్ పురపాలిక ప్రగతి బాట పట్టాలంటే నిధులు విడుదల చేయాలి. జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికి వినతిపత్రాలు సమర్పించాం. మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. త్వరగా విడుదల చేయాలని కోరాం.

పోలీసుల అదుపులో మెదక్ పట్టణ ఉన్నతాధికారి

హైదరాబాద్: మెదక్ పట్టణంలో పనిచేస్తున్న ప్రభుత్వ ఉన్నతాధికారి ఒకర్ని ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఈ ప్రభుత్వాధికారి తన కుటుంబంతో కలిసి వారాసిగూడలో ఉంటున్నారు. మరో మహిళను పెళ్లి చేసుకోవడంపై భార్య అతడిని నిలదీసింది. ఇరువురి మధ్య గొడవ జరగడంతో మాట్లాడుకుందామని చెప్పి భార్యను బయటకు తీసుకెళ్లాడు. ఆందోళనకు గురైన ఆమె బంధువులు 100 నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వారిని తార్నాకలో అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. రాత పూర్వక ఫిర్యాదు ఇవ్వకపోవడంతో కేసు నమోదు చేయలేదని తెలిపారు.


ఆత్మీయ నేస్తాలు.. ప్రాణదాతలు

నేడు జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం



అత్యవసరం ఏర్పడితే.. బంధం లేకున్నా రక్తదానం చేసే దాతలు ఎందరో ఆదర్శంగా నిలుస్తున్నారు. నిండు ప్రాణాలు నిలబెట్టే వారు ప్రత్యక్ష దైవంగా భావిస్తుంటాం. చిన్నారి మొదలు వృద్ధుల వరకు వివిధ సమయాల్లో రక్తం దొరక్క అల్లాడుతుంటారు. వారికి మేమున్నామంటూ రక్తదానం చేసే వారు ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో భారీగా ఉండటం విశేషం. ఏ సమయమైనా ముందుకొస్తున్నారు. వ్యక్తిగతంగా, బృందాలుగా బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. అలాంటి ఆత్మీయులపై జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం సందర్భంగా 'న్యూస్‌టుడే' కథనం.

ఈ సారు.. 49 సార్లు




సిద్దిపేట వాసి, మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా. కె. హుస్సేన్ ఇప్పటి వరకు 49 సార్లు రక్తదానం చేశారు. ఓ+ గ్రూపు కాగా.. 18వ ఏట నుంచే ఇస్తున్నారు. డిగ్రీ ప్రథమ సంవత్సరంలో ఓ మహిళకు అత్యవసరం కాగా, వెంటనే స్పందించడంతో ప్రాణం నిలబడటం సంతృప్తినిచ్చింది. అప్పటి నుంచి 30 ఏళ్లుగా అత్యవసరంలో స్పందిస్తున్నారు. సర్కారు దవాఖానాల్లో చికిత్స పొందే నిరుపేదలకు తొలి ప్రాధాన్యంగా రక్తదానం చేస్తున్నారు.

సామాజిక బాధ్యతగా..



సిద్దిపేట జిల్లాలో సామాజిక మాధ్యమాల వేదికగా పలువురు ఆపన్నహస్తాన్ని అందిస్తున్నారు. పోలీసు బ్లడ్ ఆర్గనైజేషన్, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి బ్లడ్ గ్రూపు (సిద్దిపేట), సిద్దిపేట బ్లడ్ బ్యాంకు వంటి వాట్సాప్ గ్రూప్‌ల్లో అన్ని వర్గాల వారు భాగస్వాములయ్యారు. ఆరేళ్లలో 2500 మందికి పైగా రక్తదానం చేశారు. 2 వేల మంది వివరాలు ఉండగా, సమన్వయంతో ముందుకు సాగుతున్నట్లు కుకునూరుపల్లి పోలీసు కానిస్టేబుల్ దాసరి చంద్రశేఖర్ తెలిపారు.

యువ సారథ్యం.. స్ఫూర్తి మంత్రం



బీఎస్‌డీఎఫ్ (భారత్ సొసైటీ డెవలప్‌మెంట్ ఫోర్స్) ఆధ్వర్యంలో పదేళ్ల కిందట బ్లడ్ సర్కిల్ గ్రూపు ఏర్పాటు చేశారు. అనుబంధంగా 16 వాట్సాప్ గ్రూపులు ఉండగా.. వాటిల్లో మొత్తం 2 వేల మంది సభ్యులున్నారు. రక్తదానంపై అవగాహన కల్పిస్తున్నారు. అత్యవసరంలో ఏటా 300 మంది స్పందిస్తున్నారు. స్ఫూర్తిని కొనసాగిస్తున్నామని వ్యవస్థాపక అధ్యక్షుడు నాగార్జున్, సమన్వయకర్త భాను వెల్లడించారు.



రక్తదాతలు

తల్లిదండ్రుల ఆనందం చూసి..



2011లో తలసేమియాతో బాధపడుతున్న చిన్నారికి రక్తదానం చేయగా.. ఆ తల్లిదండ్రుల కళ్లలో కనిపించిన ఆనందం అతడికి రక్తదానం చేసేలా ప్రేరేపించింది. అప్పటి నుంచి ఇప్పటివరకు 48 సార్లు రక్తదానం చేశారు. అతడే మెదక్ జిల్లా పాపన్నపేట మండలం కుర్తివాడకు చెందిన బూర్జుకాడి నరేష్, ఎంకాం చదువుతున్నప్పుడు అమ్మ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్‌తో కలిసి పని చేయడం ఈ దిశగా అడుగేయడానికి తోడ్పడింది.

శిబిరాలు నిర్వహిస్తూ..



సంగారెడ్డి జిల్లా నాగలిగిద్ద మండలం ఉటపల్లికి చెందిన **ఓంప్రకాశ్..** ఇప్పటివరకు 40 సార్లు రక్తదానం చేశారు. ఇతడిది ఓ- నెగెటివ్ గ్రూప్. ఈ గ్రూప్ వారు అరుదుగా ఉంటారు. రెండు నెలలకోసారి నారాయణఖేడ్‌లో శిబిరాలు నిర్వహిస్తూ యువత రక్తదానం చేసేలా ప్రోత్సహిస్తున్నారు. 63050-43932 నంబరుకు ఫోన్ చేస్తే చాలు దానం చేయడానికి సిద్ధంగా ఉంటారు.

ఎవరు చేయొచ్చంటే..

- 18 - 55 ఏళ్లున్న వారు ఎవరైనా రక్తదానం చేయొచ్చు.
- మూడు నెలల వ్యవధితో ఏడాదికి నాలుగుసార్లు ఇవ్వొచ్చు.
- ఒక వ్యక్తి రక్తదానం చేయడం ద్వారా ముగ్గురు ప్రాణాలను కాపాడవచ్చు.

159 సార్లు ముందుకొచ్చి..



ఎవరికైనా రక్తం అత్యవసరమని తెలిస్తే చాలు వెంటనే అక్కడికి వెళ్లిపోతారు...తాండూరుకు చెందిన వైద్యుడు సంపత్‌కుమార్.. ఇప్పటివరకు 159 సార్లు రక్తదానం చేశారు.

నాన్న స్ఫూర్తితో..



సంగారెడ్డికి చెందిన సాజిద్ అలీ తండ్రి షబ్బీర్‌అలీ. నాన్న స్ఫూర్తిగా రక్తదానం చేసేందుకు ముందుకొచ్చారు. ప్రాణాపాయ పరిస్థితుల్లో ఉన్న కాన్పు, రోడ్డు ప్రమాదాల బాధితులకు రక్తం ఇచ్చి కాపాడారు. ఎవరికైనా, ఎప్పుడైనా అత్యవసరమైతే 96527-86001 నంబరుకు ఫోన్ చేస్తే చాలు సిద్ధంగా ఉంటారు.

న్యూస్‌టుడే, సిద్దిపేట, సంగారెడ్డి అర్బన్, తాండూరు నారాయణఖేడ్ రూరల్, మెదక్ టౌన్

'మల్లన్న' హుండీ ఆదాయం రూ.63.66 లక్షలు



కానుకలు లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

చేర్యాల: కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయానికి హుండీల ద్వారా రూ.63.66 లక్షల నగదుతో పాటు బంగారు, వెండి కానుకలు వచ్చినట్లు ఈవో ఆలూరు బాలాజీశర్మ తెలిపారు. మెదక్ జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనరు చంద్రశేఖర్ పర్యవేక్షణలో సోమవారం మొత్తం 24 హుండీలను విప్పి భక్తులు సమర్పించిన నగదు, ఆభరణాల లెక్కింపు చేపట్టారు. రూ.63,66,933 నగదు, 51 గ్రాముల మిశ్రమ బంగారం, ఒక కిలో 50 గ్రాముల మిశ్రమ వెండి కానుకలు, 25 విదేశీ కరెన్సీ, 6 క్వింటాళ్ల బియ్యం వచ్చినట్టు చెప్పారు. ఇది 76 రోజుల్లో సమకూరిందని పేర్కొన్నారు. ప్రధానార్చకుడు మహదేవుని మల్లికార్జున్, ఏఈవో బుద్ది శ్రీనివాస్, పర్యవేక్షకులు, అర్చకులు, సిబ్బంది, సిరిసిల్లకు చెందిన శివరామకృష్ణ భజన మండలి 200 మంది సభ్యులు పాల్గొన్నారు.

విదేశీ భాషలు నేర్చుకుంటే ఉన్నతస్థానం

సిద్దిపేట టౌన్: విదేశీ భాషలు నేర్చుకుంటే విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగవచ్చని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేట ఇందిరానగర్ జడ్పీ ఉన్నత పాఠశాల రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ఇఫ్లూ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో పాఠశాలలో విదేశీ భాషలు నేర్చుకున్న విద్యార్థులకు సోమవారం ధ్రువపత్రాలను ఆయన అందజేశారు. పలువురు విద్యార్థులు తాము నేర్చుకున్న ఇంగ్లిష్, ఫ్రెంచి, స్పానిష్ భాషల్లో సంభాషించి అబ్బురపరిచారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మాట్లాడారు. పాఠశాల కోసం ఆడిటోరియం ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కోరగా రూ.10 లక్షలు మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అదనపు తరగతి గదులు, మురుగు పారుదల వ్యవస్థకు నాట్కో నుంచి రూ.40 లక్షలు ఇస్తామని చెప్పారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థులందరికీ తన సొంత ఖర్చుతో ఐప్యాడ్‌లు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఉపాధ్యాయులను సన్మానిస్తానన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాజప్రభాకర్‌రెడ్డి, సెక్టోరల్ అధికారి రామస్వామి, భారాస నాయకులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు సాంకేతికత అవసరం



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న వీసీ, అనురాగ్ వర్సిటీ అధికారులు

ములుగు: ఉద్యాన పంటల సాగులో సాంకేతిక విద్య ఎంతో అవసరమని సిద్దిపేట జిల్లా ములుగులోని కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి నీరజ ప్రభాకర్ అన్నారు. సోమవారం పరిపాలన విభాగం కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన అనురాగ్ వర్సిటీ, ఉద్యాన విశ్వవిద్యాలయం మధ్య పలు అంశాలపై పరస్పర ఒప్పందం కుదుర్చుకున్నాయి. భవిష్యత్తులో రెండు సంస్థల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. రిజిస్ట్రార్ భగవాన్, డీన్‌లు లక్ష్మీనారాయణ, రాజశేఖర్, విజయ, అనురాగ్ విశ్వవిద్యాలయం అధికారులు అర్చన, నారాయణరెడ్డి, ప్రతిభ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ ఉమ్మడి మెదక్ జిల్లా జట్ల ఎంపిక

హుస్నాబాద్, న్యూస్‌టుడే: హుస్నాబాద్‌లో సోమవారం ఉమ్మడి మెదక్ జిల్లా హ్యాండ్‌బాల్ జట్లు ఎంపిక చేశారు. స్థానిక మినీ స్టేడియంలో జిల్లా పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో అండర్-17 బాలబాలికల హ్యాండ్‌బాల్ పోటీలు నిర్వహించారు. పురపాలిక అధ్యక్షురాలు ఆకుల రజిత ప్రారంభించారు. ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారు అక్టోబరు 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నారాయణపేట జిల్లా కోస్గిలో జరిగే టోర్నీలో పాల్గొంటారు. హెచ్ఎం వాసుదేవరెడ్డి, పుర ఉపాధ్యక్షురాలు ఐలేని అనిత, లింగమూర్తి, రాజు, ఆర్. శ్రీనివాస్, కౌన్సిలర్లు నళిని, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

భారతసైన్యానికి మరో అధునాతన ఆయుధం



ఆయుధాల వాహనాన్ని ప్రారంభిస్తున్న మేజర్ జనరల్ రాకేశ్‌కుమార్ మనోచా

మనోహరాబాద్, న్యూస్‌టుడే: అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో డీఆర్‌డీవో, భారత సైన్యం సహకారంతో మేకిన్ ఇండియాలో భాగంగా అధునాతన మెషిన్‌గన్‌ను తయారు చేశామని లోకేశ్ మెషిన్ లిమిటెడ్ కోఛైర్మన్ శ్రీకృష్ణ అన్నారు. మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ పారిశ్రామికవాడలో లోకేష్ మెషిన్ పరిశ్రమ తయారు చేసిన 9x19 ఎంఎం 550 మెషిన్‌గన్‌లను సోమవారం దిల్లీకి తరలించే వాహనాన్ని మేజర్ జనరల్ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ఎస్ఎం, వీఎస్ఎం, జీవోసీ రాకేశ్‌కుమార్ మనోచా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయనకు శ్రీకృష్ణ, ఆర్మీ అధికారులు ఘన స్వాగతం పలికారు. పరిశ్రమలో ప్రదర్శనకు ఉంచిన ఆయుధాల పనితీరు, తయారీకి వాడిన ముడి సరకుల సమాచారాన్ని తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విదేశాల నుంచి ముడిసరకు దిగుమతి చేసుకోకుండా తయారు చేయడం మంచి పరిణామమని, ఇలాంటివి భారత సైన్యానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో పరిశ్రమ ఎండీ లోకేశ్వరరావు, విశ్రాంత ఆర్మీ అధికారి రాజీవ్ శర్మ, ఆర్మీ అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులు

సిద్దిపేట టౌన్: నిజామాబాద్‌లో ఇటీవల తెలంగాణ యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో సిద్దిపేట క్రీడాకారులు ప్రతిభ చాటారు. అండర్-18 విభాగంలో రిథమిక్ పేర్(జంట) అంశంలో ఎల్. సింధూరి, మనీషా స్వర్ణాలు సాధించారు. 45 -55 పురుషుల విభాగంలో ట్రెడిషనల్ అంశంలో పల్లె సురేశ్ స్వర్ణ పతకం, మహిళల విభాగంలో ఉమాదేవి నాలుగో స్థానంలో నిలిచారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తోట అశోక్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డిలు వారిని శిక్షకులు సతీష్, సంధ్యలను అభినందించారు.

మహిళా ప్రయాణికులే లక్ష్యంగా చోరీలు



అరెస్టయిన నిందితులు

రెజిమెంటల్‌బజార్: మహిళా ప్రయాణికులే లక్ష్యంగా చోరీలకు పాల్పడుతున్న ఇద్దరు దొంగలు, చోరీ వస్తువులను కొనుగోలు చేసిన ఇద్దరిని టాస్క్‌ఫోర్స్, గోపాలపురం పోలీసులు అరెస్టు చేశారు వారి నుంచి 20 చరవాణులు, ఓ బైక్ స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ వై.వి.ఎస్. సుధీంద్ర తెలిపిన వివరాలు.. సిద్దిపేట జిల్లా గజ్వేల్‌కు చెందిన సిరిగిరి కవిత పండ్లు విక్రయిస్తుంది. మేడ్చల్‌కు చెందిన ఆమె మరిది వాంకుడోత్ ప్రసాద్ ఆటోడ్రైవర్. వచ్చే ఆదాయం చాలక ఇద్దరూ కలిసి చోరీల బాటపట్టారు. రద్దీ ప్రాంతాల్లో, ఆర్టీసీ బస్సుల్లో, మహిళల బ్యాగుల్లోని చరవాణులు దొంగిలించి, వాటిని కాచిగూడకు చెందిన మహ్మద్ రఫీయుద్దీన్, మహ్మద్ ఇస్మాయిల్‌కు విక్రయిస్తున్నారు. ఫిర్యాదులు రాగా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితులు రైల్వేస్టేషన్ ప్రాంతంలో అనుమానాస్పదంగా కనిపించగా అదుపులోకి తీసుకుని విచారించగానేరం అంగీకరించారు. గోపాలపురం, ఉప్పల్, కామారెడ్డి, ఓయూ, గౌరారం, సిద్దిపేట, పేట్‌బషీరాబాద్, రామాయంపేట, మేడ్చల్ పరిధిలో చోరీలకు పాల్పడ్డారు. గతంలోనూ 13 కేసుల్లో నిందితులుగా ఉన్నారు. సొత్తు కొనుగోలు చేసిన వారినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

చికెన్ ధరలు			
ఫాంరేటు	110-00	డ్రెస్డ్	191-00
రిటైల్	132-00	స్కిన్‌లెస్	218-00

పూల తోట.. సస్యరక్షణతోనే దిగుబడి

రైతేరాజు

న్యూస్‌టుడే, చేర్యాల

డిమాండ్‌తో పాటు సీజన్‌కు అనుగుణంగా పంటల సాగు లాభదాయకం. రానున్నది పండగల సీజన్. ఈ తరుణంలో పూలకు డిమాండ్‌కు అధికంగా ఉంటుంది. ఇటీవల కురిసిన వర్షాలు, మారిన వాతావరణంతో పూల తోటల్లో సస్యరక్షణ చర్యలు ఎంతో అవసరం. ఉమ్మడి మెదక్, వికారాబాద్ జిల్లాల్లో బంతి, చామంతి, మల్లె, కనకాంబరం ఎక్కువగా తోటలు సాగు చేస్తున్నారు. ఈ తరుణంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను సిద్దిపేట తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం కోఆర్డినేటర్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టరు జక్కుల విజయ్ ఇలా వివరించారు.

బంతి..: బంతి తోటలో ప్రస్తుతం పేనుబంక సమస్య అధికంగా ఉంటుంది. ఇవి మొక్కలోని రసాన్ని పీల్చుకుంటాయి. ఆశించిన దిగుబడి రాదు. నివారణకు ఎసిఫేట్ 1 గ్రా. లేదా డైమిథోయేట్ 2 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి 15 రోజులకోసారి పిచికారీ చేయాలి. దీపపు పురుగులు ఆకులపై ఎక్కువగా ఆశిస్తాయి. నివారణకు 0.3 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్ మందును లీటరు నీటికి కలిపి చల్లాలి.



- గొంగళి పురుగు ఆశించి కొనభాగాలను తిని ఈనెలను మిగులుస్తాయి. స్పైనోశాడ్ 0.3మి.లీ. లేదా సైపర్‌మెత్రిన్ 1 మి.లీ... లీటరు నీటికి కలిపి చల్లితే ఫలితం ఉంటుంది.

గులాబీ..: గులాబీ తోటలకు పెంకు పురుగులు ఆశించి రాత్రివేళ ఆకులు తిని నష్టం కలిగిస్తాయి. నివారణకు క్లోరిపైరిఫాస్ 2 మి.లీ. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. ఆకులపై బూడిద తెగులు ఆశిస్తే బూడిద వంటి తెల్లటి పదార్థం ఏర్పడి ఆకులు ముడుచుకుంటాయి. నివారణకు ప్రొపికోనజోల్ 1 మి.లీ. లేదా డినోకాప్ 1 మి.లీ. మందు లీటరు నీటికి కలిపి చల్లాలి. ● ఎండు తెగులు ఆశించి మొక్క పైభాగం నుంచి కిందికి ఎండిపోతుంది. నివారణకు తెగులు సోకిన కొమ్మను కత్తిరించాలి. ఆయా చోట్ల కాపర్ ఆక్సీక్లోరైడ్ వేస్తును పూయాలి.



మల్లెపూలు..: ప్రస్తుతం మల్లె తోటలకు మొగ్గతొలుచు పురుగు ఆశిస్తోంది. పురుగు లార్వా మొగ్గలోకి చొచ్చుకెళ్లి తినేస్తుంది. నివారణకు మలాథియాన్ మందు 2 మి.లీ. లేదా థయాక్లోప్రిడ్ 1 మి.లీ. లేదా స్పైనోశాడ్ 0.3 మి.లీ. మందును లీటరు నీటికి కలిపి చల్లితే ఫలితం ఉంటుంది.

కనకాంబరం..: ఈ తోటలకు ప్రస్తుతం నులిపురుగులు ఎక్కువగా ఆశిస్తాయి. వీటి వల్ల ఆకులు ముడుచుకొని ఊదారంగుకు మారుతాయి. మొక్కలు గిడసబారుతాయి. నివారణకు 10కిలోల కార్బోఫ్యూరాన్ గుళికలు వేసి భూమిలో కలిపి నీరు పెట్టాలి. ఎకరాకు 200 కిలోల వేప పిండి వేయాలి. ఎండు తెగులు సోకి ఆకులు కిందికి వాలుతాయి. కాండం కుళ్లిపోతుంది. చివరకు మొక్కలు చనిపోతాయి. నివారణకు లీటరు నీటికి 2.5 గ్రా. మాంకోజెట్ లేదా 0.75 గ్రా. ట్రైఫ్లోక్సిస్ట్రోబిన్‌తో టెబుకోనజోల్‌ను కలిపి 20-25 మి.లీ. మందు ద్రావణంతో మొక్క మొదలు చుట్టూ నేల తడిసేలా చల్లాలి.

సాగులో సందేహాలా?

సంప్రదించాల్సిన ఫోన్ నం: **93815 15588**

సాగు పద్ధతులు, చీడపీడల నివారణ, సస్యరక్షణపై రైతుల ప్రశ్నలకు సిద్దిపేట తోర్నాల వ్యవసాయ పరిశోధన కేంద్రం సమన్వయకర్త విజయ్ సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: పత్తికి పచ్చ దోమ ఆశించింది. నివారణ చర్యలు తెలపండి? – సుదర్శన్, చేగుంట

సమాధానం: 0.25 మి.లీ. ఇమిడాక్లోప్రిడ్, ఎసిఫేట్ 1.5 గ్రాములు, పిప్రోనిల్ 2 మి.లీ... లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.

– న్యూస్‌టుడే, చేర్యాల

పాటించు.. నివారించు..



వాతావరణంలో మార్పులతో కాకర తోటలకు చీడపీడలు ఆశించే అవకాశం ఉంది. పండు ఈగ ఆశించి నష్టపరుస్తుంది. సన్నని పురుగులు కాయ గుజ్జును తినేస్తాయి. నివారణకు లీటరు నీటిలో మలాథియాన్ 2 మి.లీ. కలిపి పిచికారీ చేయాలి. రాలిపోయిన కాయలను ఏరి కాల్చివేయాలి. ఎకరాకు 4 నుంచి 5 లింగాకర్షక బుట్టలు ఏర్పాటుచేయాలి. ● ప్రస్తుతం పాముపొడ పురుగు ఆశిస్తుంది. గొంగళి పురుగు మాదిరిగా ఉండి ఆకు పొరల్లో చొచ్చుకుపోతాయి. నివారణకు ప్రొఫెనోఫాస్ 2 మి.లీ. మందును లీటరు నీటిలో కలిపి చల్లాలి. పూత వచ్చే వరకు 5 శాతం వేప గింజల కషాయాన్ని 15 రోజులకోసారి చల్లాలి.

- న్యూస్‌టుడే, పాపన్నపేట

పత్తిలో ఆకుమచ్చ తెగులా..

ఇటీవలి భారీ వర్షాల అనంతరం పత్తి పంటను ఆకు మచ్చ తెగులు, పిండినల్లి పురుగులు ఎక్కువగా ఆశిస్తున్నాయి. వీటి నివారణకు తగిన మోతాదులో మందులు వాడాలి. ఆకుమచ్చ తెగులు నివారణకు ప్లాంటో మైసిన్ లేదా స్ట్రెప్టోమైసిన్ 0.2 గ్రా., కాపర్ ఆక్సీక్లోరైడ్‌ను 3 గ్రా... లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పిండినల్లి పురుగు నివారణకు లీటరు నీటికి 2 గ్రా.ఎసిఫేట్‌తో పాటు 1 మి.లీ. శాండోవిట్ జిగురు మందు కలిపి మొక్క తడిచేలా పిచికారీ చేయాలి. – జహీరాబాద్ అర్బన్

సమయానుకూల సాగు.. లాభాలు బాగు





సమయం, డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు లాభదాయకమని నిరూపిస్తున్నారు గుమ్మడిదల మండలం వీరన్నగూడెంకు చెందిన రాంచందర్. ఈయనకు రెండెకరాల పొలం ఉంది. ఇందులో సాధారణంగా వరితో పాటు కూరగాయలు సాగు చేస్తుంటారు. పండగలు సీజన్ వచ్చిందంటే మాత్రం పూల సాగు బాట పడతారు. ఏటా దసరా, దీపావళి, కార్తిక మాసం వచ్చే ముందు బంతి పూలు పండిస్తున్నారు. ఎకరా పొలంలో ఎర్ర, పసుపు పచ్చ రకాలను సాగు చేస్తున్నారు. నాణ్యమైన విత్తనాలు తెచ్చి నాటడంతో పాటు అన్ని రకాల సస్యరక్షణ చర్యలు తీసుకుంటున్నారు. నాటు వేసింది మొదలు పూత వచ్చే వరకు నిత్యం కంటికి రెప్పలా కాపాడుకుంటారు. పురుగులు ఆశించినట్లు గుర్తించగానే అధికారుల సూచనలతో మందులు పిచికారీ చేస్తున్నారు. విత్తనాలు, మందులు, ఇతరత్రా వాటికి ఎకరాకు రూ.50 వేల వరకు పెట్టుబడి అవుతోంది. దసరా నుంచి మొదలుకొని కార్తికమాసం చివరి వరకు నాలుగు కాతలు చేతికొస్తున్నాయి. ఒక్కో కాతకు ఎకరాకు 6 క్వింటాళ్ల మేర దిగుబడి వస్తోంది. మొత్తం సీజనలో 24 క్వింటాళ్ల మేర దిగుబడి సాధిస్తున్నారు. హైదరాబాద్, జిన్నారం, బొంతపల్లి మార్కెట్‌కు తరలించి విక్రయిస్తున్నారు. వీటి అమ్మకం ద్వారా రూ.లక్ష వరకు ఆదాయం ఆర్జిస్తున్నారు. పెట్టుబడి పోను రూ.50 వేల వరకు మిగులుతోంది. ఈ లెక్కన ఎకరాలో పూల సాగుతో రూ.2 లక్షల వరకు ఆర్జిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.

- న్యూస్‌టుడే, గుమ్మడిదల

పోలీసులు వచ్చె.. గ్రామస్థులు అడ్డుకునే..

గురువన్నపేటలో రెండో రోజూ ఉద్రిక్తత



నిందితుడి ఇంటిపై దాడి చేసిన వారిని పోలీసులు తీసుకెళ్తుండగా అడ్డుకుంటున్న గ్రామస్థులు

చేర్యాల, న్యూస్‌టుడే: బాలికపై అత్యాచారం ఘటన జరిగిన సిద్దిపేట జిల్లా చేర్యాల సర్కిల్ పరిధిలోని గురువన్నపేట గ్రామంలో రెండో రోజు సోమవారమూ ఉద్రిక్తత నెలకొంది. ఆదివారం నిందితుడి ఇంటికి నిప్పు పెట్టి, కారు ధ్వంసం చేసిన ఘటనలో కేసు నమోదైన నిందితులను అదుపులోకి తీసుకోవడానికి సోమవారం ఉదయం పోలీసులు గ్రామానికి వచ్చారు. వారిలో ఆరుగురిని వాహనంలో ఎక్కించుకొని తరలిస్తుండగా పోలీసు వాహనాలను గ్రామస్థులు అడ్డుకున్నారు. దారికి అడ్డంగా బైఠాయించారు. హుస్నాబాద్ ఏసీపీ సతీశ్, చేర్యాల సీఐ శ్రీను, ఎస్సై రాజు చేరుకొని సముదాయించే ప్రయత్నం చేశారు. ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు అదనపు బలగాలను రప్పించారు. అదుపులోకి తీసుకున్న వారిని వదిలిపెట్టాలని గ్రామస్థులు నినాదాలు చేశారు. గత్యంతరం లేక చివరకు వాహనాల్లో ఉన్న ఆరుగురిని పోలీసులు వదిలిపెట్టారు. అదనపు డీసీపీ మల్లారెడ్డి మాట్లాడుతూ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకూడదన్నారు. అత్యాచార బాధిత కుటుంబాన్ని భాజపా మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి, జనగామ జిల్లా అధ్యక్షుడు దశమంతరెడ్డి, మహిళ విభాగం అధ్యక్షులు లక్ష్మి, బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శి సురేశ్, నాయకులు పరామర్శించారు. నిందితుడికి కఠిన శిక్ష పడాలని వారు డిమాండ్ చేశారు.

అంత్యక్రియలకు వెళ్తూ ట్రాక్టర్ బోల్తా

ఒకరి దుర్మరణం పలువురికి గాయాలు

దౌల్తాబాద్: అంత్యక్రియలకు వెళ్తూ ట్రాక్టర్ బోల్తాపడి ఒకరు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. వికారాబాద్ జిల్లా దౌల్తాబాద్ ఎస్ఐ రవిగౌడ్ తెలిపిన వివరాలు.. మండలంలోని ఈర్లపల్లి నుంచి నాగసార్‌కు బంధువుల అంత్యక్రియల నిమిత్తం ట్రాక్టర్‌లో బయలుదేరారు. దేవర్‌పస్లావాద్ సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లి బోల్తాపడింది. ఈర్లపల్లికి చెందిన మాల అమృతమ్మ (51) అక్కడికక్కడే మృతి చెందింది. మాల కిష్టప్ప, నర్సమ్మ, అచ్చన్న, కవిత, దస్తమ్మ, బాలమ్మ, బసప్పలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం ప్రైవేట్ వాహనాల్లో కొడంగల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధిత కుటుంబీకుడు లాలప్ప ఫిర్యాదుతో కేసు నమోదైంది.

కారు టైరు పేలి ఒకరు..

బొంరాస్‌పేట (కొడంగల్): వేగంగా వెళ్తున్న కారు టైర్ పేలడంతో ప్రమాదానికి గురై ఒకరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్ఐ రవూఫ్ తెలిపిన వివరాలు.. సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట ప్రాంతంలో హైదరాబాద్ నుంచి కర్ణాటకలోని మల్కేడ్‌కు బయల్దేరిన ఓ కారు బొంరాస్‌పేట చెరువు మలుపు వద్ద టైర్ పేలి అదుపు తప్పి ఎదురుగా వస్తున్న లారీని ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న విశ్వనాథ్ (49) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరు.. రవికుమార్, రవిచంద్రలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని హైదరాబాద్‌కు తరలించారు. మృతుడు మల్కేడ్ వాసిగా గుర్తించారు. భాస్కర్‌రావు ఫిర్యాదుతో కేసు నమోదైంది.

బైక్‌తో చెట్టును ఢీకొని మేస్త్రీ..

వెల్దుర్తి: అతివేగంగా ద్విచక్ర వాహనంపై వస్తూ అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టి ఓ వ్యక్తి మృతి చెందాడు. మెదక్ జిల్లా వెల్దుర్తి ఏఎస్ఐ సాదత్‌మియా తెలిపిన వివరాలు.. కర్నూల్ జిల్లా ఎమునూర్‌కు చెందిన కట్ల రమేష్(35) మండలంలోని మానేపల్లిలో ఉంటూ మేస్త్రీగా పని చేస్తున్న అదే జిల్లాకు చెందిన పాలపర్తి శ్రీనివాస్ వద్దకు పది రోజుల క్రితం వచ్చాడు. అతడి వద్ద పనికి చేరాడు. సోమవారం మానేపల్లి పక్క గ్రామం అందుగులపల్లికి పని నిమిత్తం వెళ్లాడు. సాయంత్రం ద్విచక్రవాహనంపై తిరిగి బయల్దేరాడు. వేగంగా వస్తూ అందుగులపల్లి శివారులో ఓ చెట్టుకు ఢీకొట్టి పడిపోగా తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలికి వెళ్లి పరిశీలించారు. మృతుడు రమేష్ వివరాల కోసం శ్రీనివాస్‌ను అడగ్గా భార్యాపిల్లలు ముంబయిలో ఉంటారని, వారి చిరునామా తెలియదని చెప్పాడు. ఇంకా ఫిర్యాదు అందలేదని, రాగానే కేసు నమోదు చేస్తామని ఏఎస్ఐ వివరించారు.

బాలిక మరణానికి కారణమైన.. దంపతులకు జీవిత ఖైదు

సంగారెడ్డి అర్బన్: ఐదేళ్ల బాలికను చిత్రహింసలకు గురిచేసి మరణానికి కారణమైన దంపతులకు జీవిత ఖైదు విధిస్తూ ఫ్యామిలీ కోర్టు నాలుగో సెషన్స్ కోర్టు న్యాయమూర్తి కోట్ల లావణ్య బాల్‌రెడ్డి సోమవారం తీర్పు ఇచ్చిందని సంగారెడ్డి ఎస్పీ రూపేష్ తెలిపారు. కొండాపూర్ మండలం మల్కాపూర్‌లోని గాంధీనగర్‌కు చెందిన సయ్యద్ జకీర్ అహ్మద్ హెడ్ కానిస్టేబుల్. గతంలో ఐడీఏ బొల్లారంలో పని చేశాడు. సతీమణి రజియా సుల్తానాతో కలిసి కొండాపూర్‌లో నివాసం ఉన్నాడు. వారింట్లో ఐదేళ్ల బాలికను పనిలో పెట్టుకున్నారు. పని సరిగా చేయ లేదని బాలికను చితకబాదగా.. అపస్మారకస్థితికి చేరింది. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. 2015, జనవరి 29న ఈ ఘటన జరిగింది. చైల్డ్ హెల్ప్‌లైన్ అధికారి ఎం.ఎస్. చంద్ర కొండాపూర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో వివరాలు సమర్పించారు. పూర్వాపరాలు పరిశీలించిన న్యాయమూర్తి దంపతులిద్దరికీ జీవితఖైదు విధించారు.

రెండోసారి ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ మృతి



మంగవ్వ

దుబ్బాక: ఆర్నెల్ల క్రితం బావి వద్దకు వెళ్లి ఆత్మహత్య చేసుకుంటానని ఓ వృద్ధురాలు యత్నించగా కుటుంబ సభ్యులు కాపాడారు. సెప్టెంబరు 22న ఆమె మద్యం మత్తులో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. సిద్దిపేట జిల్లా దుబ్బాక ఎస్ఐ వి.గంగరాజు తెలిపిన వివరాలు.. మండలంలోని అప్పనపల్లికి చెందిన గ్యార మైసయ్య కూలీ పనులు చేస్తూ, భార్య మంగవ్వ (66), ఇద్దరు కుమారులతో కలిసి జీవనం కొనసాగిస్తున్నాడు. మంగవ్వకు మద్యం తాగే అలవాటుంది. సెప్టెంబరు 22న బంధువు అంత్యక్రియలకు వెళ్లి, మద్యం తాగి ఇంటికి వచ్చింది. కుటుంబీకులతో గొడవపడింది. గడ్డి మందు తాగింది. కుటుంబీకులు గుర్తించి 108 వాహనంలో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన చికిత్సకు హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. మైసయ్య ఫిర్యాదుతో కేసు నమోదైంది.

పంపుహౌస్ ప్రైవేటు ఇంజినీర్ ఆత్మహత్య



వెంకటేశ్

గజ్వేల్ గ్రామీణ: కొండపోచమ్మ సాగర్‌కు సంబంధించిన పంపుహౌస్ వద్ద ఇంజినీర్‌గా పని చేస్తున్న యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. సిద్దిపేట జిల్లా మక్తమాసాన్‌పల్లికి చెందిన చింత వెంకటేశ్ (26)కు భార్య శిరీష, ఏడాదిన్నర వయసున్న కుమారుడు ఉన్నారు. గజ్వేల్ మండలం అక్కారం శివారు పంపుహౌస్‌లో ప్రైవేటు కంపెనీలో ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం విధులకు హాజరైన వెంకటేశ్.. తోటి ఉద్యోగులు రమ్మని పిలిచినా మధ్యాహ్న భోజనానికి వెళ్లలేదు. అందరూ భోజనానికి వెళ్లగానే తాను ఉన్న గదిలోనే ఉరేసుకున్నాడు. తోటివారు వచ్చి కిందికి దించి గజ్వేల్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే వెంకటేశ్ మృతి చెందినట్లు వైద్యులు తేల్చిచెప్పారు. ఈ ఘటనపై ఫిర్యాదు రాలేదని గజ్వేల్ సీఐ సైదా తెలిపారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

క్రీడల్లో రాణిస్తే భవిష్యత్తు



కబడ్డీ ఆడుతున్న విద్యార్థినులు

కార్ఖానా, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణిస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల జోనల్ స్థాయి పోటీలను సోమవారం బోయిన్‌పల్లి క్రీడా మైదానంలో బోర్డు సీఈవో మధుకర్‌నాయక్‌తో కలిసి ప్రారంభించారు. పోటీల్లో వికారాబాద్, మేడ్చల్, మెదక్, సిద్దిపేట, సంగారెడ్డి, రంగారెడ్డి, హైదరాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల నుంచి సుమారు 699 మంది ఆశ్రమ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నారని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి కోటాజీ తెలిపారు.

పేదలకు అండ సీఎంఆర్ఎఫ్



శివ్వంపేట, న్యూస్‌టుడే: సీఎం సహాయ నిధి ఆపదలో ఉన్న పేదలకు అండగా నిలుస్తుందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శివ్వంపేట మండలం గుండ్లపల్లి, చండి గ్రామాల్లో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. గ్రామాల్లో పర్యటించి బాధితులను పరామర్శించారు. మాజీ ఎంపీపీ కల్లూరి హరికృష్ణ, గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ మాజీ చంద్రాగౌడ్, నాయకులు యాదాగౌడ్ తదితరులు ఉన్నారు.

కస్తూర్బా విద్యార్థినులకు కష్టాలు

టేక్మాల్, పెద్దశంకరంపేట, శివ్వంపేట, న్యూస్‌టుడే: దూర ప్రాంతాల నుంచి విద్యనభ్యసించేందుకు వచ్చి ఇక్కడే నివాసముండే విద్యార్థినిలకు ఇబ్బందులు తప్పడం లేదు. చదువుపై శ్రద్ధచూపలేక అనేక ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలో ఉన్న సమస్యలపై 'న్యూస్‌టుడే' కథనం.



టేక్మాల్‌లో పనిచేయని సోలార్ వాటర్ హీటర్

ఏళ్ల నుంచి సమస్యలు..



నిరుపయోగంగా సీసీ కెమెరాలు

మండల కేంద్రమైన టేక్మాల్‌లో ఉన్న కస్తూర్బా గాంధీ విద్యాలయంలో 6-10వ తరగతి వరకు 196 మంది విద్యార్థినులు ఉన్నారు. ఇక్కడే చదువుకుంటూ.. నివాసం ఉంటున్నారు. గతంలో వారి సౌకర్యం కోసం సోలార్ వాటర్ హీటర్ ఏర్పాటు చేశారు. అది నాలుగేళ్ల నుంచి పనిచేయడం లేదు. దీంతో వర్షాకాలం, చలికాలంలో విద్యార్థులకు వేడి నీరు అందే పరిస్థితి లేదు. తాగునీటి కోసం నీటి శుద్ధి యంత్రం ఏర్పాటు చేయగా.. ఐదేళ్ల నుంచి పనిచేయడం లేదు. దీంతో బోరు, మిషన్ భగీరథ నీటిని వినియోగించాల్సి వస్తోంది. గతంలో పాఠశాల చుట్టూ సోలార్ విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయగా.. మరమ్మతులకు నోచుకోకపోవడంతో తీగలు వేలాడుతున్నాయి. పాఠశాలలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు ఆరేళ్ల నుంచి నిరుపయోగంగా మారాయి. శౌచాలయానికి సంబంధించిన ట్యాంక్ చిన్నదిగా ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదు. పాఠశాల వెనక భాగంలో పిచ్చి మొక్కలు పెరిగి పాములు తిరుగుతున్నాయి. క్రీడా మైదానం గుట్ట ప్రాంతంలో ఉంది. గదుల్లో మంచాలు లేక నేలపై నిద్రిస్తున్నారు. వర్షాకాలంలో గదుల్లోకి నీరు కారుతోంది. టేక్మాల్-ఎల్లుపేట తారు రోడ్డు నుంచి పాఠశాల వరకు మట్టి రోడ్డు కావడంతో ఇబ్బందులు తప్పడం లేదు.

పాముల సంచారం..



గూడూరు పాఠశాలలో పాము

శివ్వంపేట మండలం గూడూరు, నార్సింగిలో కస్తూర్బ పాఠశాలలు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం 252 మంది విద్యార్థినిలు ఉన్నారు. మంచాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. వాటర్ హీటర్, 6 సీసీ కెమెరాలు పనిచేయడం లేదు. విద్యాలయం వెనక ప్రహరీ ధ్వంసం కావడంతో పాములు సంచరిస్తున్నాయి. ఇటీవల విద్యాలయంలోని ఏఎన్ఎంకు కాటు వేసింది.

రోడ్డు కుంగి ఇక్కట్లు..

పెద్దశంకరంపేటలోని కస్తూర్బలో 200 మంది విద్యార్థినిలు ఉన్నారు. దారి సరిగా లేకపోవడంతో ఏ వస్తువులు తీసుకెళ్లాలన్నా అవస్థలు పడాల్సి వస్తోంది. నీరు వెళ్లడానికి మురుగు కాలువ లేదు. రహదారి విస్తరణలో ప్రహరీ కూలిపోవడంతో రక్షణ లేకుండా పోయింది.

నీటిశుద్ధి యంత్రం బాగు చేయిస్తాం: బాలమణి, ప్రత్యేక అధికారిణి, కస్తూర్బా టేక్మాల్

టేక్మాల్‌లో నీటిశుద్ధి యంత్రం బాగు చేయించేందుకు నిధులు మంజూరుకావడంతో బాగు చేయిస్తాం. పిచ్చి మొక్కలు తొలగించేందుకు పంచాయతీ అధికారిని కోరగా మందు పిచికారీ చేయిస్తామని తెలిపారు. ఇతర సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా..

మెదక్	95730 81675	పెద్దశంకరంపేట	80085 73251
నర్సాపూర్	80085 73222	రామాయంపేట	94402 31031
తూప్రాన్	96762 58144		
చేగుంట	80085 73200		(10AM TO 1 PM)

న్యూస్‌టుడే, నర్సాపూర్, హవేలిఘనపూర్

? నర్సాపూర్ పట్టణం 10వ వార్డులో నీటి సరఫరా సమస్యల పరిష్కారానికి పైప్‌లైన్లు తవ్వి వదిలేశారు. నెలరోజులు దాటినా పుర సిబ్బంది పట్టించుకోవడం లేదు. – సాయి, నర్సాపూర్

✓ విచారించి తగిన చర్యలు తీసుకుంటాం.–రామకృష్ణారావు, కమిషనర్

? నర్సాపూర్ 5వ వార్డులో బోరులో నీరున్నా సరఫరా జరగకుండా పుర సిబ్బంది స్టార్టర్‌ను తొలగించారు. మంజీరా సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు నీటి ఇబ్బందులు తప్పడం లేదు. – యాదయ్య నాయి, స్థానికుడు

✓ సిబ్బందితో చర్చించి సమస్య పరిష్కరిస్తాం. – అశోక్‌గౌడ్, పురపాలిక అధ్యక్షుడు

? హవేలిఘనపూర్‌లోని ఆయా వీధుల్లో విద్యుత్తు దీపాలు ఏర్పాటు చేయక రాత్రిళ్లు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. – గోపాల్, స్థానికుడు

✓ వీధి దీపాలు పరిశీలించి, పంచాయతీ సిబ్బందికి చెప్పి సమస్య పరిష్కరిస్తాం. – వెంకటేశ్వర్, పంచాయతీ కార్యదర్శి

రైతుల కష్టాలు తీర్చండి: సీపీఎం



మాట్లాడుతున్న మల్లేశం

రామాయంపేట: బీడీ కార్మికులకు షరతులు లేకుండా రూ.4వేల జీవన భృతి, రైతులకు రుణమాఫీ, పంట నష్టపరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం డిమాండ్ చేశారు. సోమవారం రామాయంపేటలో పార్టీ ప్రాంతీయ మహాసభ జరిగింది. ఏచూరి పటానికి నివాళులు అర్పించారు. అనంతరం రామాయంపేట నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఏరియా కమిటీ కార్యదర్శిగా బాలమణి, సహాయ కార్యదర్శులుగా నీలం బాబు, లక్ష్మీ నర్సయ్య, ప్రవీణ్, సభ్యులుగా నారాయణ, మహేందర్, పుష్పలను ఎన్నుకున్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ బాగుండాలి

కౌడిపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ బాగుండాలని కౌడిపల్లి ఎంపీడీవో శ్రీనివాస్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో ఎంపీవో కలీముల్లాతో కలిసి పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

వెల్దుర్తి, న్యూస్‌టుడే: విద్యుత్తు నియంత్రిక పక్కన గడ్డి మేస్తుండగా విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన సోమవారం కుకునూర్‌లో జరిగింది. నష్ట పరిహారం అందించాలని యజమాని ఆంజనేయులు కోరారు.

సాదాసీదాగా పురపాలిక సర్వసభ్య సమావేశం



ఎజెండా చదువుతున్న మున్సిపల్ మేనేజర్ రఘువరన్

తూప్రాన్: పురపాలక కౌన్సిల్ సమావేశం సోమవారం సాదాసీదాగా ముగిసింది. ఛైర్‌పర్సన్ మామిళ్ల జ్యోతి కృష్ణ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. బతుకమ్మ ఉత్సవాలు, గాంధీ విగ్రహం వద్ద జెండా పునరుద్ధరణ, మురికి కాలువలపై మ్యాన్‌హోల్‌లు సరిచేసేందుకు తీర్మానాలు చేశారు. సమావేశంలో వైస్‌ఛైర్మన్ శ్రీనివాస్, కమిషనర్ ఖాజోమోయినొద్దీన్, మేనేజర్ రఘువరన్, సభ్యులు పాల్గొన్నారు.

ప్రశ్నిస్తారనే భయంతోనే: సమావేశం ఏర్పాటు చేసిన కొద్దిసేపటికే ఛైర్మన్, కమిషనర్, కౌన్సిల్ సభ్యులు బయటకు వెళ్లిపోవడంపై భారాస సభ్యులు ఆందోళన చేశారు. మాజీ ఛైర్మన్ రవీందర్ గౌడ్‌తో పాటు కౌన్సిలర్లు లావణ్య, పద్మ, అరుణలు సమావేశంలో పాల్గొనేందుకు లోపలికి వచ్చారు. ఇంతలోనే సమావేశం ముగిసిందని అధికారులు, మిగతా కౌన్సిల్ సభ్యులు బయటకు రావడంపై వారు అసహనం వ్యక్తం చేశారు. అభివృద్ధిపై ప్రశ్నిస్తారనే భయంతోనే వెళ్లిపోయారని రవీందర్ గౌడ్ ఆరోపించారు. రిజిస్టర్‌లో సంతకాలు పెట్టకుండా చేయాలని ఉద్దేశంతోనే రిజిస్టర్ సైతం కమిషనర్ వద్ద పెట్టుకోకుండా ఛైర్మన్‌కు ఇచ్చారని అన్నారు.

కలెక్టర్‌కు ఫిర్యాదు: కౌన్సిల్ సమావేశాన్ని అర్ధాంతరంగా ముగించడంపై మాజీ ఛైర్మన్ రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు ఫిర్యాదు చేశారు. 11.50 గంటలకు సమావేశం ప్రారంభమైతే 11.58 గంటలకు వెళ్లగానే సమావేశం ముగిసిందని అధికారులు వెళ్లిపోయారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎజెండా అంశాలు పూర్తిగా చదవకుండానే కావాలని రిజిస్టర్ తీసుకొని పోయారన్నారు. సీసీ కెమెరాలు పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు.

బకాయి వేతనాలు చెల్లించండి

మెదక్ టౌన్, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న పంచాయతీ కార్మికుల వేతనాలు వెంటనే విడుదల చేయాలని గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా కమిటీ అధ్యక్షురాలు నర్సమ్మ డిమాండ్ చేశారు. సోమవారం మెదక్ పట్టణం కేవల్ కిషన్ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కార్మికులు దసరా, బతుకమ్మ పండుగలు జరుపుకోవడానికి డబ్బులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. జిల్లా నాయకులు పద్మారావు, పోచయ్య ఉన్నారు.

సీపీఎం డివిజన్ కార్యదర్శిగా నాగరాజు

నర్సాపూర్, న్యూస్‌టుడే: నర్సాపూర్ డివిజన్ సీపీఎం కార్యదర్శిగా కడారి నాగరాజు రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నర్సాపూర్‌లో నిర్వహించిన డివిజన్ మహాసభలో ఎన్నికను ప్రకటించారు. సీపీఎం లక్ష్యాలకు అనుగుణంగా, ప్రజా పనిచేస్తానని నాగరాజు తెలిపారు.

పంచాయతీ కార్మికులకు దుస్తుల పంపిణీ

పెద్దశంకరంపేట, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆఫ్ నారాయణఖేడ్ ఆధ్వర్యంలో బాంబే కట్ పీస్ సెంటర్ సహకారంతో పేట పంచాయతీ కార్యాలయంలో సోమవారం కార్మికులకు దుస్తులు అందజేశారు. క్లబ్ బాధ్యులు రాజ్‌కుమార్, నాగనాథ్‌రావు, పెంటయ్య ఉన్నారు.

తెగుళ్లతో అప్రమత్తత అవసరం

పాపన్నపేట: వరి పంటకు ప్రస్తుతం వస్తున్న దోమపోటు, పాము పొడ తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని బసంతపూర్, తొర్నాల వ్యవసాయ కళాశాల శాస్త్రవేత్తలు విజయకుమార్, సరిత, విజయ్ కుమార్‌లు సూచించారు. సోమవారం మల్లంపేట గ్రామంలో వరి పొలాలను పరిశీలించారు.

పశువులకు నిలయం.. అంగన్వాడీ భవనం..



శివ్వంపేట మండలం గూడూరులో కొన్నేళ్ల కిందట అంగన్వాడీ భవనం నిర్మించారు. నిధులు చాలక స్లాబ్ వేసి వదిలేశారు. దీంతో చాలా ఏళ్లుగా పశువులకు నిలయంగా మారింది. ఫలితంగా కేంద్రాన్ని ఒక షట్టర్‌లోని ఇరుకు గదిలో నిర్వహిస్తున్నారు. దీంతో చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేసి భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, శివ్వంపేట

కుంట నిండా.. గుర్రపు డెక్క



నర్సాపూర్‌లో-తూప్రాన్ మార్గంలోని కోమటికుంట ఇది. కురుస్తున్న వర్షాలకు నీరు చేరి గుర్రపు డెక్క పెరిగింది. దూరం నుంచి చూస్తే మైదానంలా తలపిస్తోంది. ఎవరైనా దీనిని గమనించక అందులోకి వెళ్తే ప్రమాదానికి గురయ్యే అవకాశాలున్నాయి. జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ఈ కుంటతో ప్రమాదం పొంచి ఉంది. వెంటనే గుర్రపుడెక్కను తొలగించాలని వాహనచోదకులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నర్సాపూర్

ప్రధాన రోడ్డులో గుంత..తప్పని చింత



ఇది ఎక్కడో మారుమూల గ్రామానికి వెళ్లే రోడ్డులో ఏర్పడిన గుంతలో నిలిచిన నీరు అనుకుంటే పొరపాటే. ఇది జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలోని మెదక్-హైదరాబాద్ ప్రధాన రహదారిలోని నర్సాపూర్ చౌరస్తాలో ఏర్పడిన గుంత. ఇది ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా.. దానిని సరిచేయడంలో అధికారులు అలసత్వం వహిస్తున్నారు. దీనికితోడు వర్షాలు కురిసిన ప్రతిసారి నీరు చేరి చిన్నపాటి నీటి మడుగును తలపిస్తుంది. ఆ గుంతను గుర్తించలేక వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. – న్యూస్‌టుడే, మెదక్ టౌన్

పింఛన్లకు వృద్ధుల పడిగాపులు



తపాలా కార్యాలయం వద్ద నిరీక్షిస్తున్న వృద్ధులు

కౌడిపల్లి, న్యూస్‌టుడే: కౌడిపల్లి తపాలా కార్యాలయం వద్ద సోమవారం పింఛన్ల కోసం వృద్ధులు పడిగాపులు కాశారు. ఉదయమే వచ్చిన వారు సాయంత్రం వరకు వేచి ఉన్నారు. పింఛన్లు పంపిణీ చేసే బీపీఎం కోసం వేచి ఉన్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటేశం దృష్టికి తీసుకుపోగా.. బీపీఎంకు చాలా గ్రామాలున్నాయని.. పంపిణీ చేయడం ఆలస్యమైందని తెలిపారు.

పిచ్చి మొక్కల తొలగింపు

తూప్రాన్: తూప్రాన్‌లో రూ.కోటిన్నర నిధులతో నిర్మించిన వైకుంఠ ధామం తీరుపై 'కోట్లు వెచ్చించారు. నిర్వహణ మరిచారు' అనే శీర్షికన సోమవారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనంపై అధికారులు స్పందించారు. కమిషనర్ ఆదేశాలతో పురపాలక సిబ్బంది పిచ్చి మొక్కలు తొలగించారు.

లాభాల్లో వెల్దుర్తి సొసైటీ ముందంజ

వెల్దుర్తి: లాభాల బాటలో వెల్దుర్తి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(సొసైటీ) జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిచిందని డీసీసీబీ డైరెక్టర్, వెల్దుర్తి సొసైటీ ఛైర్మన్ తిరుమల అనంతరెడ్డి తెలిపారు. వెల్దుర్తిలో సోమవారం జరిగిన అర్ధవార్షిక మహాజన సభలోమాట్లాడారు. 2005 వరకు నష్టాల్లో ఉన్న సొసైటీ. పాలకవర్గం కృషితో నష్టాల నుంచి గట్టెక్కిందన్నారు. ప్రస్తుతం రూ.94 లక్షల లాభం సాధించిందని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్లు నర్సింలు, కిష్టాగౌడ్ తదితరులున్నారు.



శివ్వంపేట: కోదండ రామాలయంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



మెదక్ వీర హనుమాన్ కాలనీలో..



కౌడిపల్లి: గిరిజన గురుకుల పాఠశాల వద్ద వేడుకలు

బంతిపూల బతుకమ్మ

న్యూస్‌టుడే, బృందం: బతుకమ్మల సందడి మొదలైంది. గ్రామాలు, పట్టణాల్లో మహిళలు, బాలికలు, యువతులు పూలతో బతుకమ్మలు తయారు చేసి ఒకచోట ఉంచి బతుకమ్మ ఆడారు. అనంతరం చెరువుల్లో నిమజ్జనం చేశారు. పాఠశాలల్లోనూ విద్యార్థులు, ఉపాధ్యాయినులు బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

సమష్టి కృషితో గ్రంథాలయం ఏర్పాటు



గడిపెద్దాపూర్‌లో ప్రారంభించిన గ్రంథాలయం

అల్లాదుర్గం, న్యూస్‌టుడే: అల్లాదుర్గం మండలంలోని గడిపెద్దాపూర్ గ్రామస్థులు సమష్టి కృషితో పాత గ్రామపంచాయతీ భవనంలో సోమవారం గ్రంథాలయం ఏర్పాటు చేశారు. యువకులు, ఉద్యోగులు, నాయకుల సహకారంతో స్వచ్ఛందంగా ఏర్పాటు చేశామన్నారు.

కాలుష్య పరిశ్రమలపై చర్యలు తీసుకోండి

శివ్వంపేట, న్యూస్‌టుడే: శివ్వంపేట మండలం నవాబ్‌పేట గ్రామ శివారులో కాలుష్యం వెదజల్లుతున్న పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు సోమవారం డిమాండ్ చేశారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు.

షెడ్డు వినియోగంలోకి తెచ్చేందుకు చర్యలు



డంప్‌యార్డును సందర్శించిన అశోక్‌గౌడ్, రామకృష్ణారావు

నర్సాపూర్, న్యూస్‌టుడే: పట్టణంలో డీఆర్‌సీసీ, ఎఫ్ఎస్‌టీపీ షెడ్డు వీలైనంత త్వరలో వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని పురపాలిక అధ్యక్షులు అశోక్‌గౌడ్, కమిషనర్ రామకృష్ణారావులు తెలిపారు. నిర్మాణంలో డంప్‌యార్డు, హానికర వ్యర్థాల శుద్ధి కేంద్రం నిర్మాణం పనులను సోమవారం పరిశీలించారు. వార్డు అధికారులు రాములు, రాజు, ఆంజనేయులు, మురళీ తదితరులున్నారు.

రైతులకు అందుబాటులోకి వ్యవసాయ పనిముట్లు

శివ్వంపేట, న్యూస్‌టుడే: వ్యవసాయ పనిముట్లు అన్నదాతలకు అందుబాటులోకి తీసుకువచ్చి మేలు చేస్తున్నామని రామేశ్వరం చండీ రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఛైర్మన్ దొంతి రెడ్డి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గోమారంలో సోమవారం ఏకలవ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో మూడో వార్షిక సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సభ్యత్వం నమోదు చేయించుకోవడానికి రైతులు ముందుకు రావాలన్నారు. సంస్థ ప్రతినిధులు నరేంద్ర, కోట సురేష్, ఏవో లావణ్య, మాధవ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ వాకిటి హనుమంత్ రెడ్డి, నరసింహారెడ్డి, సభ్యులు పాల్గొన్నారు.

వరద తగ్గింది..అమ్మ దర్శనమిచ్చింది

పాపన్నపేట, న్యూస్‌టుడే: ఏడుపాయలలో అమ్మవారి దర్శనం సోమవారం పునః ప్రారంభమైంది. ఆరు రోజులుగా సింగూరు నుంచి దిగువకు నీటిని విడుదల చేయడంతో ఆలయం వద్ద వరద ప్రవాహం కొనసాగింది. దీంతో ఆలయాన్ని మూసివేసి రాజగోపురంలో అమ్మవారి ఉత్సవ విగ్రహానికి పూజలు కొనసాగించారు. ఆదివారం రాత్రికి వరద ప్రవాహం స్వల్పంగా ఉండడంతో సోమవారం తెల్లవారుజామున సిబ్బంది ఆలయాన్ని శుభ్రం చేశారు. అర్చకులు అమ్మవారికి అభిషేకం చేసి, సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు.

లడ్డూను కల్తీ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలి



నిరసన వ్యక్తం చేస్తున్న విశ్వహిందూ పరిషత్, ఇతర సంఘాల నాయకులు

మెదక్ అర్బన్, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూను కల్తీ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పబ్బ సత్యనారాయణ, విభాగ్ సంఘటన కార్యదర్శి పుట్టి మల్లేశం డిమాండ్ చేశారు. ఈ విషయమై విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సోమవారం మెదక్ పట్టణ రాందాస్ చౌరస్తా వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ వివాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలన్నారు. దేవాదాయ శాఖను రద్దు చేసి, పీఠాధిపతులు, ఆధ్యాత్మిక, సామాజిక వేత్తలతో ధార్మిక పరిషత్తును ఏర్పాటు చేసి దేవాలయ వ్యవస్థను నిర్వహించాలన్నారు. దేవాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ఇతర మతాల వారిని వెంటనే తొలగించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ రాహుల్ రాజ్‌కు వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ జిల్లా ఉపాధ్యక్షుడు మల్కాజీ సత్యనారాయణ, సహ కార్యదర్శి రామచంద్రం, పట్టణ అధ్యక్షుడు అరవింద్ గౌడ్, బాధ్యులు శ్యామ్, సురేష్, ముత్యాలు, లక్ష్మి, శారద, విమల, శ్రీనివాస్, కృష్ణ, భాజపా జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల్లో వయోవృద్ధుల దినోత్సవం



బిజిలీపూర్‌లో ప్రతిజ్ఞ చేయిస్తూ..

శివ్వంపేట, తూప్రాన్, మనోహరాబాద్, చిన్నశంకరంపేట, చిలప్‌చెడ్, న్యూస్‌టుడే: పలు గ్రామాలు, పట్టణాల్లోని అంగన్వాడీ కేంద్రాల్లో సోమవారం వయోవృద్ధుల దినోత్సవం నిర్వహించారు. శివ్వంపేట, బీజీలీపూర్, దొంతి, గంగాయపల్లిలో ప్రతిజ్ఞ నిర్వహించారు. తూప్రాన్ మండలం ఘనపూర్ 2వ చిన్నారులకు వృద్ధుల వేషధారణ చేశారు. వయోవృద్ధులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని మనోహరాబాద్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మెహతాబ్ అన్నారు. చిన్నశంకరంపేట మండల పరిధి రుద్రారంలో పిల్లల నాయనమ్మలను, తల్లులను సత్కరించారు. వయసుకు తగిన పోషక పదార్థాలు తినడంతోనే మంచి ఆరోగ్యం సాధ్యమని చిలప్‌చెడ్ ఎంపీడీవో ఆనంద్, ఐసీడీఎస్ మండల పర్యవేక్షకురాలు సంతోషిమాత అన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

కౌడిపల్లి: కౌడిపల్లి మండల కేంద్రంలోని 132/కేవీ విద్యుత్తు కేంద్రంలో మరమ్మతుల కారణంగా మంగళవారం మూడు మండలాలకు విద్యుత్తు సరఫరా ఉండదని మండల ట్రాన్స్‌కో ఏఈ కోటేశ్వర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొల్చారం, చిలప్‌చెడ్, కౌడిపల్లి మండలాలకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

టేక్మాల్, న్యూస్‌టుడే: మండల పరిధి ధనూర విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు సందర్భంగా ఆయా గ్రామాల్లో మంగళవారం విద్యుత్తు సరఫరా ఉండదని టేక్మాల్ ట్రాన్స్‌కో ఏఈ ఉదయ భాస్కర్ తెలిపారు. ధనూర పరిధి కోరంపల్లి, ధనూర, కుసంగి, ఎక్లాస్‌పూర్, పల్వంచ గ్రామాల్లో ఉదయం 8:30 గంటల నుంచి 10:30 వరకు సరఫరా ఉండదన్నారు.

ఘనంగా సోమన్నగారి లక్ష్మీ జయంతి

నర్సాపూర్: దివంగత టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి సోమన్నగారి లక్ష్మీ జయంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నర్సాపూర్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, రాష్ట్ర నాయకులు రవీందర్‌రెడ్డి, సుహాసినిరెడ్డి, సుజాత, మల్లేశం తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పండ్లతోటల పెంపకానికి ప్రాధాన్యం

చిన్నశంకరంపేట: రైతులు పండ్ల తోటల పెంపకానికి ముందుకు రావాలని ఎంపీడీవో దామోదర్ సూచించారు. సోమవారం కామారం, రాజ్యా తండాల్లో తోటలను పరిశీలించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం లోపించకుండా చూసుకోవాలన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



శివ్వంపేట, న్యూస్‌టుడే: శివ్వంపేట మండలం గోమారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2008-09 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం గోమారంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు.